రైతు కులాసా.. ఉందిలే భరోసా

- వ్యవసాయ సేవలకు కేంద్రంగా ఆర్బీకేలు
- రంగంపేట మండలంలో 19 నిర్మాణం
- ఇప్పటికే 8 భవనాలు పూర్తి



పెదరాయవరంలో అందుబాటులోకి వచ్చిన రైతు భరోసా కేంద్రం

రంగంపేట: అన్నం పెట్టే అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముందుకు సాగుతోంది.. విత్తు నుంచి పంట ఉత్పత్తుల విక్రయం వరకూ చేదోడుగా నిలుస్తోంది.. పుడమి పుత్రుల సంక్షేమానికి, అన్ని రకాల సేవలూ అందుబాటులో ఉంచాలన్న లక్ష్యంతో రైతు భరోసా కేంద్రాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేశారు. వీటి ద్వారా రైతులకు అవసరమైన అన్ని సేవలను అందుబాటులోకి తెచ్చారు. అంతేకాకుండా ఈ కేంద్రాల నిర్వహణకు శాశ్వత భవనాలు ఉండాలని ప్రభుత్వం నిర్ణయించింది. రంగంపేట మండలంలో ఇప్పటికే కొన్ని భవనాలను పూర్తి చేయగా, మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయి.

ఇవీ ప్రయోజనాలు

గతంలోలా మండల కేంద్రాలకు వెళ్లే అవసరం లేకుండా సొంతూరులోనే ఆర్బీకేల ద్వారా వ్యవసాయ రంగ సేవలు పొందవచ్చు. ప్రతి ఆర్బీకేలో వ్యవసాయ సహాయకులను నియమించి సాగులో సలహాలు, సూచనలు అందిస్తున్నారు. ఆర్బీకేల నుంచే ధాన్యం కొనుగోలు, ఎరువులు, పురుగు మందులు ఇలా అన్ని సేవలు అందించే విధంగా చారిత్రాత్మక నిర్ణయం తీసుకోవడంతో రైతులకు మేలు జరుగుతోంది.

ఎక్కడెక్కడ.. ఏ దశల్లో

రంగంపేట మండలంలో 19 ఆర్బీకే భవనాలు నిర్మించాల్సి ఉండగా ఒక్కో భవనానికి రూ. 21.80 లక్షల చొప్పున ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. భవన నిర్మాణాలకు టెండర్ల ప్రక్రియ సత్వరమే పూర్తి చేయడంతో పనులు వేగంగా పూర్తవుతున్నాయి. రంగంపేట మండలం సింగంపల్లి, పెదరాయవరం గ్రామాల్లో ఆర్బీకే భవనాలు పూర్తకావడమే కాకుండా ప్రారంభోత్సవం జరిగి రైతు సేవలకు అందుబాటులోకి వచ్చాయి. సుభద్రంపేటలో ఆర్బీకే భవనం పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉంది. మరో ఆరు గ్రామాల్లో ఆర్బీకే భవన నిర్మాణాలు పూర్తయి టైల్స్ పనులు జరుగుతున్నాయి. తొమ్మిది భవనాలు వివిధ దశల్లో ఉండగా, జి.దొంతమూరు, బాలవరం గ్రామాల్లో ఆర్బీకే భవనాల నిర్మాణానికి స్థల సేకరణ జరగాల్సి ఉంది.

రైతులకు వరం



గత ప్రభుత్వాల హయాంలో రైతులను పట్టించుకునే నాథుడే లేడు. ఏ చిన్న పనికైనా మండల కేంద్రాలకు పరుగులు తియ్యాల్సి వచ్చేది. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో రైతు భరోసా కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి. రైతుల వద్దకే వ్యవసాయ సేవలు అందిస్తున్నారు. సీఎం జగన్‌కే రైతుల మద్దతు.

–పేపకాయల రాంబాబు, జెడ్పీటీసీ, రంగంపేట

త్వరలో అందుబాటులోకి..



మండలంలో రైతు భరోసా కేంద్ర భవనాల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. ప్రభుత్వం ఆర్బీకే భవన నిర్మాణాల విషయంలో చిత్తశుద్ధితో వ్యవహరిస్తుంది. అసంపూర్తిగా ఉన్న భవనాలను త్వరితగతిన పూర్తి చేస్తాం. రైతులకు భవన నిర్మాణాలను త్వరలోనే అందుబాటులోకి తెస్తాం.

–కమ్మసత్తి శ్రీనివాసరావు, ఏఈ, పంచాయతీరాజ్, రంగంపేట

ఎంతో ప్రయోజనం



రైతు భరోసా కేంద్రాలు రైతులకు ఎంతో ప్రయోజనకరం. వీటిలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు నుంచి పండించిన పంట విక్రయం వరకూ సూచనలు, సలహాలు అందిస్తున్నారు. పంట రుణాలు, బీమా, గిట్టుబాటు ధర కల్పించడంలో ఆర్బీకే సిబ్బంది రైతులకు సహాయ పడుతున్నారు.

–నలమాటి భీముడు, రైతు, వడిశలేరు

'నన్నయ' అధ్యాపకురాలికి కూచిపూడిలో బీ గ్రేడ్


వీసీ పద్మరాజు నుంచి ధ్రువీకరణ పత్రాన్ని అందుకుంటున్న శ్రీరాజరాజేశ్వరీదేవి

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో సహాయ అధ్యాపకురాలిగా పనిచేస్తున్న కడలి శ్రీరాజరాజేశ్వరీదేవికి దూరదర్శన్ నుంచి కూచిపూడి డ్యాన్స్‌లో బీ గ్రేడ్ లభించింది. ఇందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాన్ని ఆమెకు వీసీ ఆచార్య కె.పద్మరాజు శనివారం అందజేసి అభినందనలు తెలిపారు. ప్రసార భారతి బ్రాడ్ కాస్టింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, దూరదర్శన్, హైదరాబాద్ స్టూడియోలో నిర్వహించిన ఆడిషన్‌లో కూచిపూడి నాట్యంలో ఆమె చూపిన ప్రతిభతో బీ గ్రేడ్‌ను సొంతం చేసుకున్నారు. బీఈడీ కళాశాలలో సహాయ అధ్యాపకురాలిగా, కూచిపూడి డిప్లమా కోర్సు కోఆర్డినేటర్‌గా ఆమె వ్యవహరిస్తున్నారు.

సీఎం సభకు తరలివెళ్లిన జనం


బూరుగుపూడి నుంచి నిడదవోలు వెళ్లిన లబ్ధిదారులు, నాయకులు

మధురపూడి: నిడదవోలులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కాపునేస్తం సభకు కోరుకొండ మండలంలోని లబ్ధిదారులు శనివారం తరలివెళ్లారు. మండలంలోని 22 గ్రామ సచివాలయాల నుంచి 16 వాహనాల్లో 890 మంది లబ్ధిదారులు పయనమయ్యారు. అలాగే వివిధ వాహనాల్లో వైఎస్సార్ సీపీ శ్రేణులు నిడదవోలుకు వెళ్లారు.

సీతానగరం: మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు నిడదవోలులో జరిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభకు తరలివెళ్లారు. మొత్తం 15 బస్సుల్లో ఆయా గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు వెళ్లగా, ఇది సరిపోక కార్లు, మోటారు సైకిళ్లు, ఆటోలు, ఆర్టీసీ బస్సులలో కూడా వెళ్లారు.

మద్యం విక్రేతల అరెస్ట్

రాజమహేంద్రవరం రూరల్: మద్యం అక్రమంగా విక్రయిస్తున్న ఒకరిని, యానాం మద్యం తీసుకు వస్తున్న మరొకరిని అరెస్టు చేసినట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో నార్త్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కొంతమూరు పప్పులవారి వీధికి చెందిన మారిశెట్టి దుర్గారావును అరెస్టు చేసి అతని నుంచి 8 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. నగరంలో ఆర్యాపురానికి చెందిన బర్లసతీష్ యానాం నుంచి మద్యం తీసుకు వస్తుండగా సీతంపేట వద్ద సిబ్బందికి చిక్కాడు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి


ప్రకాష్‌రాజ్ (ఫైల్)

కంబాలచెరువు: రోడ్డు ప్రమాదంలో ఓ బాలుడు మృతి చెందాడు. స్థానిక ఆవ రోడ్డులోని విద్యానగర్‌కు చెందిన ప్రకాష్‌రాజ్ బైపాస్ రోడ్డులోని ఓ స్కూల్‌లో చదువుతున్నాడు. శుక్రవారం స్కూల్ నుంచి తిరిగి ఇంటికి వస్తుండగా రామకృష్ణ థియేటర్ వద్దకు వచ్చేసరికి ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో ఆ బాలుడిని దగ్గర్లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ డ్రైవర్, ఆ సంస్థ అధికారుల నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో బాలుడి కుటుంబీకులు ఆసుపత్రి వద్ద ఆందోళన చేశారు.

క్లుప్తంగా

నేడు బలభద్రపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం

బిక్కవోలు: బలభద్రపురం గ్రామంలోని ఆదివారం నాలుగో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమాని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు వివరిస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు తరలి రావాలని ఆయన కోరారు.

నేడు కొత్త పింఛన్ల పంపిణీ

మధురపూడి: గాదరాడలో కొత్తగా మంజూరైన పింఛన్లను ఆదివారం పంపిణీ చేయనున్నారు. తొలుత కోరుకొండ నుంచి బైక్ ర్యాలీ నిర్వహిస్తారు. అక్కడి హరేరామ సమాజం నుంచి ప్రారంభమయ్యే ఈ బైక్ ర్యాలీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఆధ్వర్యంలో జరుగుతోంది.

నేటి నుంచి సహస్ర నామ స్తోత్ర వైభవం

రాజమహేంద్రవరం రూరల్: కొంతమూరు వల్లభ గణపతి మందిరం ప్రాంగణం స్వానంద నిలయంలోని శ్రీమహాదేవానందనాథ ప్రవచన మండపంలో వినాయక శరన్నవరాత్రులు ఆదివారం ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా 23వ తేదీ వరకూ 'శ్రీసుబ్రహ్మణ్య సహస్రనామ స్తోత్ర వైభవం' ప్రవచన యజ్ఞం నిర్వహిస్తారు. రోజూ సాయంత్రం వాచస్పతి బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ సప్తాహిక దీక్షగా ఉపదేశిస్తారు.

సంపర వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

పెదపూడి: సంపర గ్రామంలో నిత్యం పూజలందుకుంటున్న ప్రాచీన శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం విశేష పూజలు చేశారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక, తులసి పూజ, అమ్మవారికి కుంకుమ, పంచామృతాభిషేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు భక్తులచే వ్రతాన్ని ఆచరింపచేశారు. భక్తులు గోవింద నామాల పారాయణం చేశారు. స్వామి వారిని విశేషంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

సొసైటీ నూతన భవనం ప్రారంభం

పెదపూడి: ఏపీ త్రయం గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్) ఆవరణంలో నిర్మించిన నూతన భవనాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఈ నెల 20వ తేదీన ప్రారంభించనున్నారని ఆ సొసైటీ చైర్మన్ గుండా ఈశ్వరరావు తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ రామేశ్వరం, ఏపీ త్రయం గ్రామాల్లో రైతులకు ఉపయోగకరంగా ఈ భవనం నిర్మించారన్నారు. ఈ కార్యక్రమానికి ఆయా శాఖాధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు హాజరుకావాలని కోరారు.

సస్యరక్షణ చర్యలు అవసరం

మధురపూడి: వరి పంట పొట్ట దశలో ఉన్నప్పుడు పొటాష్ వేసేలా రైతులకు అవగాహన కల్పించాలని ఏడీ బీకే మల్లిఖార్జునరావు తెలిపారు. శనివారం కోరుకొండలో వీఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొట్ట దశకు చేరుకున్న వరి పంటను అతి జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. కోరుకొండ, రాజానగరం, సీతానగరం మండలాల్లో 43 వేల ఎకరాల్లో వరి సాగు జరుగుతుందన్నారు. సాగులో సస్యరక్షణ చర్యలు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని అన్నారు.

మండల స్థాయి జట్లకు క్రీడాకారుల ఎంపిక

పెదపూడి: ఈ నెల 14, 15 తేదీల్లో సంపర గ్రామంలో జరిగిన స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు, ఎంపికలో మండల స్థాయి జట్టుకు బాలికల నుంచి 110 మంది, బాలుర నుంచి 119 మంది ఎంపిక చేశారని ఆ పోటీల పీడీ గిరి తెలిపారు. ఆయన శనివారం పెదపూడిలో విలేకరులతో మాట్లాడుతూ మండల స్థాయిలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్ మొదలగు 9 విభాగాల్లో బాలికల నుంచి 200 మంది బాలుర నుంచి 285 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారన్నారు. వారిలో ఉత్తమ ప్రదర్శన చేసి క్రీడాకారులను మండల స్థాయి జట్టుకు ఎంపిక చేశారన్నారు. వీరు త్వరలో జిల్లా స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

రాజానగరం: గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా ఎండీ కె.శశికిరణ్‌వర్మ హాజరై కళాశాలలో ఇంక్యుబేషన్ సెంటర్‌ను స్టార్టప్‌కి, బిజినెస్‌కి వినియోగించుకోవచ్చని వారికి దిశానిర్దేశం చేశారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.లీలావతి పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ వసంతం


పుణ్యక్షేత్రంలో పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- పుణ్యక్షేత్రంలో గడప గడపకూ..

రాజానగరం: గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రతి ఇంటికీ సంక్షేమ వసంతం వచ్చిందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. శనివారం పుణ్యక్షేత్రంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో ప్రభుత్వం అందించిన పథకాల లబ్ధిపై కరపత్రాల ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ పథకాలు కొనసాగాలంటే వచ్చే ఎన్నికలలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించి, జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేయాలన్నారు. గతంలో చంద్రబాబు మోసపూరిత పాలనకు, ప్రస్తుతం జగన్ అందిస్తున్న ప్రజారంజక పాలనకు ఉన్న వ్యత్యాసాలను గుర్తించాలన్నారు. భూపాలపట్నం–పుణ్యక్షేత్రం గ్రామాల అభివృద్ధికి నాలుగున్నరేళ్లలో రూ. 8.28 కోట్లు వెచ్చించామన్నారు. అదే గత టీడీపీ ఐదేళ్లలో కేవలం రూ. 1.39 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. నాలుగున్నరేళ్లలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా 7,560 మందికి రూ. 9.73 కోట్ల ఆర్థిక ప్రయోజనం చేకూర్చామన్నారు. పుణ్యక్షేత్రంలో సుమారు 300 మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి, పక్కా ఇళ్లు నిర్మించే ఏర్పాట్లు చేశామన్నారు. జెడ్పీటీసీ వాసంశెట్టి పెద వెంకన్న, పార్టీ మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, సర్పంచ్ మరుకుర్తి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ పలివెల వెంకట్రావు, నాయకులు గంగిశెట్టి సోమేశ్వర్రావు, పేపకాయల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

బిక్కవోలు: పోషకాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని ఎంపీపీ కోవ్వూరి జ్యోతిర్మయి అన్నారు. శనివారం కొమరిపాలెం గ్రామంలో వైఎస్సార్ సంపూర్ణ పౌష్టికాహార వారోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసనలు నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ వలంటీర్లు ప్రతి ఇంటా సర్వే చేసి ప్రజల ఆరోగ్య సమస్యల గురించి తెలుసుకుని, అనారోగ్యం ఉన్న వాళ్లని గుర్తించి క్యాంపునకు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలోని కొమరిపాలెం ఉపసర్పంచి కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, సర్పంచి వాసంశెట్టి రవికుమార్, కొంకుదరు సర్పంచి సత్తి వీరమణి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గం ప్రచార కమిటీ చైర్మన్ రొంగల అప్పాజి, కొంకుదురు పీహెచ్‌సీ వైద్యులు విజయలక్ష్మి, ఐసీడీఎస్ రంగంపేట ప్రాజెక్ట్ సీడీపీవో జెస్సీ ఫ్లోరెన్స్, సూపర్‌వైజర్ శాంతి రత్నకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త పింఛన్ల పంపిణీ

రంగంపేట: ప్రతినెలా ఒకటో తారీఖు తెల్లవారుజామునే తలుపులు తట్టి వలంటీర్లు లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్నారని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ఏర్పాటుతో ప్రజల ఇంటి ముంగిటకు ప్రభుత్వ సేవలు అందుతున్నాయని అనపర్తి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మాచిన గోవిందరాజు అన్నారు. పెదరాయవరం గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ బరగటి సుజాత అధ్యక్షతన గ్రామంలో మంజూరైన 34 నూతన పింఛన్లను అవ్వాతాతలకు అందజేశారు. ఎంపీటీసీ మాచిన మమతారాణి, ఉప సర్పంచ్ మద్దిపాటి వీర్రాజు పాల్గొన్నారు.

ఆత్మీయ స్వాగతం



వైఎస్సార్ కాపు నేస్తం నాలుగో విడత నిధుల విడుదల సందర్భంగా నిడదవోలుకు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అపూర్వ స్వాగతం పలుకుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, జక్కంపూడి విజయలక్ష్మి, అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

పార్టీలకు అతీతంగా పాలన


బలభద్రపురంలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- బలభద్రపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం

బిక్కవోలు: రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగుతోందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యానారాయణరెడ్డి అన్నారు. శనివారం బలభద్రపురం గ్రామంలోని మూడో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికలకు ముందు చేపట్టిన పాదయాత్రలో ప్రజల కష్టాలను గుర్తించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వాటిని మేనిఫెస్టోలో చేర్చి పరిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాల్లో 99 శాతం అమలు చేశామన్నారు. కుల, మత, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను సీఎం జగన్ అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రానికి ఇలాంటి ముఖ్యమంత్రి అవసరమని, మళ్లీ ఎన్నికల్లో ఆయననే ఎన్నుకుందామని అన్నారు. అనంతరంగా గ్రామంలోని రూ.21 లక్షలతో వెలనెస్ సెంటర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి కమిటీ అధ్యక్షుడు నల్లమిల్లి వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గం ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజి, గ్రామ సర్పంచి బుంగా రామారావు, మండల కన్వీనర్ పోతుల ప్రసాద్ రెడ్డి, కాపవరం సర్పంచి సత్యంశెట్టి వెంకటరమణ, ఎంపీటీసీ మేడపాటి ఆనందరెడ్డి, చిన్నం వీరాఘవురెడ్డి, సొసైటీ అధ్యక్షుడు ఎస్ వివి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమలే శ్రేయస్కరం


ఎమ్మెల్యేకు, పార్టీ నాయకులకు వినాయక ప్రతిమలను ఇస్తున్న సత్యనారాయణ దంపతులు


మట్టి వినాయక ప్రతిమను ఉచితంగా పంపిణీ చేస్తున్న యువ రాజారెడ్డి


వెదుళ్లపల్లిలో మట్టి వినాయక విగ్రహాలతో విద్యార్థుల ర్యాలీ

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: పర్యావరణానికి, ప్రజలకు హాని కలిగించే పీఓపీ, రసాయనాలు వినియోగించి తయారు చేసే విగ్రహాలను కాకుండా ప్రతీ ఒక్కరూ మట్టి వినాయకుని విగ్రహాలను పూజించుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. వినాయక చవితిని పురస్కరించుకుని గ్రామానికి చెందిన కుంచం సత్యనారాయణ(శెట్టి), సంధ్యారాణి దంపతులు ఎమ్మెల్యేను కలిసి మట్టితో తయారు చేసిన వినాయక ప్రతిమను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని, మట్టితో చేసిన వినాయకుడినే పూజించి పర్యావరణాన్ని కాపాడుకుందామని అన్నారు. ఇదిలా ఉండగా అనపర్తి పాతవూరుకు చెందిన సనాతన ధర్మ పరిరక్షణ సమితి ప్రతినిధులు గ్రామంలో పలువురు ప్రముఖులను, గ్రామస్తులను కలిసి వారికి మట్టి వినాయక ప్రతిమలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, పార్టీ జిల్లా ట్రేడ్ యూనియన్ కార్యదర్శి పడాల శ్రీనివాసరెడ్డి, ఏజీపీ వెలగల లక్ష్మీనారాయణరెడ్డి ఆర్యవైశ్య సంఘం కోశాధికారి వంకాయల తాతారావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణానికి మేలు

పెదపూడి: మట్టి వినాయక విగ్రహాలతో అందరూ చవితి వేడుకలు చేసుకుంటే పర్యావరణానికి మేలు జరుగుతుందని లయన్స్ క్లబ్ కార్యదర్శి, వ్యాయమా ఉపాధ్యాయుడు, ఆధ్యాత్మిక వేత్త ద్వారంపూడి యువరాజారెడ్డి అన్నారు. జి.మామిడాడ గ్రామంలో ఆయన 200 వినాయక ప్రతిమలను తయారు చేసి భక్తులకు శనివారం ఉచితం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఏటా మాదిరిగా ఈ ఏడాది సొంతంగా ప్రజలకు వందల సంఖ్యలో మట్టి విగ్రహాలు తయారు చేశానన్నారు. వాటిని భక్తులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నారన్నారు. ప్రజలు మట్టి గణపతి ప్రతిమల వినియోగంపై అవగాహన పెంచుకుని వాటినే ఉపయోగించాలన్నారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. పాస్టర్ ఆఫ్ ప్యారీస్ రసాయనిక రంగులతో తయారు చేసిన వినాయక విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేయడంతో ఆ నీటిని వినియోగించడం వల్ల చర్మ వ్యాధులు, క్యాన్సర్ వంటి రోగాలబారిన పడే అవకాశం ఉందన్నారు.

మట్టి గణపయ్యే మేలు

సీతానగరం: పర్యావరణ హితం కోసం మట్టి గణపయ్యనే పూజిద్దామంటూ వెదుళ్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. శనివారం ఆ పాఠశాలలో సాంఘికశాస్త్రం ఉపాధ్యాయుడు శీతపతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులు 200 మట్టి గణపతి విగ్రహాలను తయారు చేశారు. అనంతరం వారు ర్యాలీగా ఇంటింటికీ వెళ్లి ఆ విగ్రహాలను పంపిణీ చేశారు. చవితి ఉత్సవాల్లో ప్రకృతి కాలుష్యానికి కారణమయ్యే పద్ధతులకు స్వస్తి చెబుతామని అవగాహన కల్పించారు. అలాగే చినకొండేపూడి సూర్యచంద్ర స్కూల్ ఆవరణలో విద్యార్థులచే ఏకో ఫ్రెండ్లీ గణేశ ప్రతిమల తయారు చేసి అందరికీ అందించారు. కరస్పాండెంట్ కె.లక్ష్మీప్రసన్న, హెచ్ఎం సీహెచ్ ఫణీంద్రరావు, ఇన్‌చార్జి టి.రామకృష్ణ పాల్గొన్నారు.